క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

చారకొండ: మండలంలోని జేపల్లి పంచాయతీ పరిధిలోని నెమలిగుట్ట తండాకు చెందిన కొర్ర వత్ దన్‌సింగ్ గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు కాయితి ఆశా దీప్‌రెడ్డి రూ.5 వేల నగదును గ్రామ నాయకులకు ఇవ్వగా వారు బాధిత కుటుంబానికి అందజేశారు. నాయకులు నూర్‌పాల్ నాయక్, పవన్ ఉన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు దోహదం

తెలకపల్లి: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని ఎస్ఐ నరేష్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని తాళ్లపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాట్ల కోసం గ్రామస్తులతో సమావేశమయ్యారు. సీసీ కెమెరాలు ఏర్పాటుకు దాతలు రూ. 16 వేలు వితరణ చేశారని తెలిపారు. సమావేశంలో హెడ్‌కానిస్టేబుల్ నారాయణ, గ్రామస్తులు పర్వతాలు, చిన్నయ్య పాల్గొన్నారు.

కుక్కల దాడిలో విద్యార్థినికి తీవ్రగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: విద్యార్థినిపై కుక్కలు దాడి చేసి గాయపర్చిన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థిని వైష్ణవి జిల్లా కేంద్రంలోని బాలిక జూనియర్ కళాశాలలో చదువుతోంది. సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి వెళ్తుండగా కళాశాల వద్ద ఉన్న కుక్కల గుంపు విద్యార్థినిపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయి. అక్కడే ఉన్న కొందరు గమనించి కుక్కలను తరిమేశారు. విద్యార్థినిని ఆస్పత్రికి తరలించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

తాడూరు: మండలంలోని గోవిందాయిపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం సింగిల్‌విండో చైర్మన్ రామచంద్రారెడ్డి, ఏపీఎం శేఖర్‌లు ప్రారంభించారు. మహిళా సంఘాల సభ్యులు, రైతులు కుమార్, జంగయ్య, సీసీ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అశ్రద్ధ వద్దు

వెల్దండ: వంట గ్యాస్ వినియోగంలో అశ్రద్ధ ఉండొద్దని కల్వకుర్తి లక్ష్మీనరసింహ్మా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సూచించారు. గురువారం మండలంలోని కొట్రలో గురువారం వంటగ్యాస్ వినియోగంపై అవగాహన కల్పించారు. శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రాములు, మహిళలు తదితరులు ఉన్నారు.

చోరీకి విఫల యత్నం

తిమ్మాజిపేట: మండలంలోని పోతిరెడ్డిపల్లెలో పట్టపగలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించి విఫలమయ్యారు. గ్రామస్తుల వివరాల ప్రకారం గురువారం గ్రామానికి చెందిన రాచూరి బాలస్వామి ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లారు. మధ్యాహ్నం వేళ బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు వచ్చి ఒకరు బైక్‌పై ఉండగా మరొకరు ఇంటి తాళం పగులగొడుతుండగా శబ్దం రావడంతో పక్కింటి వారు బయటకు వచ్చి ఎవరు మీరు అని ప్రశ్నించగా గోడ దూకి పారి పోయాడు. స్థానిక యువకులు పట్టుకునేందుకు ప్రయత్నించగా బైక్‌పై పరారయ్యారు. ఇదిలా ఉండగా ఈ సంవత్సరం మే నెలలో బాధితుడి ఇంట్లో రూ.60 వేల నగదు, మూడు మాసాల బంగారు కమ్మలు చోరీకి గురయ్యాయని గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కల్వకుర్తిరూరల్: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పట్టణానికి చెందిన ఆకుతోట స్వాతి(45) భర్త బాలస్వామితో కలిసి ద్విచక్ర వాహనంపై డిండీ వైపు వెళ్తున్నారు. కొండారెడ్డిపల్లి గేటు వద్ద శ్రీశైలం నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు వేగంగా బైక్‌ను ఢీకొన్నది. ప్రమాదంలో స్వాతి అక్కడికక్కడే మృతిచెందగా బాలస్వామికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డీ వ్యాపారిపై దాడికి యత్నం

నాగర్‌కర్నూల్ క్రైం: అధిక వడ్డీ ఆశచూపి ప్రజలను మోసం చేసిన వ్యక్తిపై బాధితులు దాడికి యత్నించారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తెలకపల్లి మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన చోటేమియా అలియాస్ జహీర్ అధిక వడ్డీ ఆశ చూపడంతో చాలా మంది తమ వద్ద ఉన్న నగదు ఇచ్చారు. అతడు మోసం చేయడంతో ఇటీవల ఓ మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ క్రమంలో వడ్డీ వ్యాపారిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. గురువారం సబ్ జైలు నుంచి విడుదలైన చోటేమియా అలియాస్ జహీర్‌పై బాధితులు ఒక్కసారిగా దాడికి యత్నించారు. పోలీసులు అడ్డుకొని అతడిని స్థానిక స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై సీఐ కనకయ్యగౌడ్‌ను వివరణ కోరగా.. వడ్డీ వ్యాపారిపై ఎవరు దాడి చేయలేదని, పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి సాయంత్రం వదిలిపెట్టినట్లు తెలిపారు.

ఘనంగా బాలల దినోత్సవం



నాగర్‌కర్నూల్ గీతాంజలి కిడ్స్ పాఠశాలలో..



కల్వకుర్తిలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీదేవి

సాక్షి, నెట్‌వర్క్: దివంగత భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని గురువారం బాలల దినోత్సవం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వేడుకలు ఏర్పాటు చేశారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

■ కొల్లాపూర్ పట్టణంలోని శ్రీవాణి విద్యానిలయంలో నెహ్రూ చిత్రపటానికి రంగినేని జగదీశ్వరుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచి నోట్‌పుస్తకాలు అందజేశారు. పట్టణంలోని గోమతి గ్రామర్‌స్కూల్, సన్‌షైన్ పాఠశాలల్లో ప్రతిభా పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

■ కల్వకుర్తి పట్టణంలోని పాత మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఉన్న ప్రభుత్వ పాఠశాలలో సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీదేవి, జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కావ్య బాలల దినోత్సవ వేడుకలను హాజరై చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి తాండ్రలో మొదటి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు.

■ లింగాల మండలంలోని అంబట్‌పల్లి రెండవ అంగన్‌వాడీ కేంద్రంలో నెహ్రూ చిత్రపటానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ పూలమాల వేసి నివాళులర్పించారు.

■ తెలకపల్లి మండల కేంద్రంలో నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిద్ధార్థ మాడల్ పాఠశాలలో విద్యార్థులు బాలల దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.



లింగాల మండలం అంబట్‌పల్లిలో..



తిమ్మాజిపేట మండలం రాళ్లచెరువుతండా..

■ పెద్దకొత్తపల్లి మండలంలోని పెద్దకార్పాముల, నక్కలపల్లి, గంట్రావ్‌పల్లి, దేవల్‌తిరుమలాపూర్, ఆవిల్లబావి పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

■ చారకొండ మండలంలోని తిమ్మాయిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా సీబీఎం ట్రస్టు ఆధ్వర్యంలో సౌండ్ సిస్టం, మైక్‌ను అందజేశారు.

■ తిమ్మాజిపేట మండలంలోని రాళ్లచెరువుతండాలో బాలల దినోత్సవం పురస్కరించుకొని మాజీ ఉప సర్పంచ్ అమృతమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు తిరుపతి గౌడ్ స్మార్ట్ టీవీ వితరణ చేశారు.

■ తాడూరు మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

■ కోడేరు మండల కేంద్రంతో పాటు వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ బ్లూమింగ్ బర్డ్స్, ప్రగతి విద్యాలయం, అక్షరాభ్యాస పాఠశాలలో చాచా నెహ్రూ జయంతి సందర్భంగా వ్యాసరచన, డ్రాయింగ్, ఆటపాటల పోటీలు నిర్వహించారు.

■ వెల్దండ మండల కేంద్రంలోని మోడల్ ఆదర్శ పాఠశాల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో మాజీ ప్రధాని చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించాయి.

■ మన్ననూర్‌లోని ఓచౌరస్తాలో నెహ్రూ జయంతి వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తాడూరులో..



వెల్దండలో మోడల్ ఆదర్శ పాఠశాలలో..



మన్ననూరులో..

ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ గైక్వాడ్

లింగాల: ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పోలీసులకు సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నేరాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. పోలీసులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా మెలగి వారికి న్యాయం చేయాలన్నారు. రాత్రి సమయాలలో గస్తీని నిర్వహించాలని పోలీసులను ఆదేశించారు. పోలీసు స్టేషన్ పరిసరాలను ఎస్పీ పరిశీలించారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్, ఎస్ఐ నాగరాజు ఉన్నారు.

ఘనంగా కార్తీక పూజలు



స్వామి వారికి తీర్థ ప్రసాదాలు తీసుకెళ్తున్న భక్తులు

మన్ననూర్: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం కమిటీ ఆధ్వర్యంలో గురువారం కార్తీక పూజలు(ఆకుపూజలు) కొనసాగాయి. ఈ సందర్భంగా గ్రామంలో ఆయా కుటుంబాల వారు రోజుకో కుటుంబం చొప్పున ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయం ప్రాంగణంలో అర్ధరాత్రి వరకు చెక్క భజనలు, గొబ్బెమ్మలు, కోలాటం ఆడుతూ భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. సహపంక్తి ఫలహారాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరం పాలకమండలి సభ్యురాలు సంబుశోభ, రుక్మిణి మహిళలు సంఘం సభ్యులు జయమ్మ, ప్రభావతమ్మ, సుమతి, దీపిక, భాగ్యమ్మ, పద్మజా, లక్ష్మమ్మ, మంజుల, భక్తులు వెంకటరమణ, బాలకృష్ణ, సురేష్, నర్సింహ, సైదులు, చంద్రమౌళి, జగతయ్య, బాలింగం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు వడ్ల కొనుగోలు

కల్వకుర్తిరూరల్: నిబంధనల మేరకు వడ్ల కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ సీతారామారావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని మార్చాలలో రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. మంగళవారం సాక్షి పత్రికలో 'ధాన్యం కొనుగోలు' నిబంధనలపై రైతుల ఆగ్రహం అనే కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అదనపు కలెక్టర్ ఆర్డీఓ శ్రీనుతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి నిర్వాహకులతో మాట్లాడారు. ఆయన వెంట పీఏసీఎస్ ఈఓ వెంకట్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ డీటీ రాఘవేందర్‌రెడ్డి ఉన్నారు.

సోమశిలకు ప్రత్యేక బస్సులు

కొల్లాపూర్: కార్తీక పౌర్ణమి సందర్భంగా కొల్లాపూర్ నుంచి సోమశిలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం ఉమాశంకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

కంప్యూటర్లు పంపిణీ

కొల్లాపూర్: రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు బాలకోటిరెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలకు రత్నగిరి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ జగన్మోహన్‌రావు, మంత్రి జూపల్లి కృష్ణారావు సోదరి పుష్పమ్మలు గురువారం కంప్యూటర్లు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ తదితరులు ఉన్నారు.

ఘనంగా సహకార సంఘం వారోత్సవాలు



తెలకపల్లిలో జెండాను ఎగురవేస్తున్న సింగిల్‌విండో చైర్మన్ ద్యాసాని భాస్కర్‌రెడ్డి

తెలకపల్లి: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయం వద్ద గురువారం 71వ అఖిలభారత సహకార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సింగిల్‌విండో చైర్మన్ ద్యాసాని భాస్కర్‌రెడ్డి, జిల్లా అధికారి రఘునాథరావు హాజరై సహకార సంఘం జెండాను ఎగురవేశారు. అనంతరం వ్యవసాయ కార్యాలయం ఆవరణలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం సహకార సంఘాలు పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, సూపరింటెండెంట్ మధురావు, మానిటరింగ్ అధికారి గణేష్, డైరెక్టర్లు రాజమహేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అచ్చుతారెడ్డి, లింగస్వామి, ఊశన్న, వ్యవసాయ మండల అధికారి నర్మద, సిఈఓ ధర్మవీర్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార భవనంలో వద్ద 71 సహకార సంఘం వారోత్సవాల సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం సహకారం సంఘాలలో పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడులు, సంఘాల ద్వార స్వయం ఉపాధి అవకాశాలపై రాష్ట్ర అధికారులతో సభ్యులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్యాం, పుల్లారెడ్డి, రామునాయక్, వెంకటయ్య, ఫరీద్, ఈఓ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశానికే కులగణన సర్వే ఆదర్శం

నాగర్‌కర్నూల్‌రూరల్: దేశానికే కుల గణన సర్వే ఆదర్శంగా నిలుస్తుందని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులడు కాళ్ల నిరంజన్ అన్నారు. గురువారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.సర్వేతో బహుజనులకు ఎంతో మేలు చేకూరనుందన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్, శివ, రాజు, నిరంజన్, నవీన్‌పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన అధికారులు

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను సర్వే ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డి గురువారం పరిశీలించారు. మండలంలోని పొల్మూరు, మేడిపూర్, అల్లాపూర్‌లో సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్లను కలిసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.



ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి

తెలకపల్లి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కాంప్లెక్స్ మీటింగ్ హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. మొత్తం 44 మందికి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక మార్కెట్‌యార్డులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, నారాయణగౌడ్, పర్వతాలు, తహసీల్దార్ జాకీర్‌అలీ, నయాబ్ తహసీల్దార్ లక్ష్మన్, ఆర్ఐ రామస్వామి, ఏపీఎం నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలను వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న తపాలాశాఖ సిబ్బంది

పెద్దకొత్తపల్లి: తపాలా సేవలను వినియోగించుకోవాలని నాగర్‌కర్నూల్ తపాలా శాఖ అధికారి సృజననాయక్ అన్నారు. గురువారం జొన్నలబొగుడలో తపాలాశాఖలో అమలవుతున్న పొదుపు పథకాలపై సిబ్బంది ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి కిసాన్‌సమ్మాన్ నిధి, గ్యాస్ సబ్సిడీ, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకం డబ్బులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తపాలాశాఖ ఖాతాలో జమ చేస్తున్నారని వివరించారు. ప్రతి ఒక్కరు తపాలాబీమాను చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో తపాలాశాఖ సిబ్బంది జగన్‌గౌడ్, శేఖర్, కురుమయ్య, గోపాల్‌రావు, సమత, శౌంధర్‌యాదవ్, రఘునాయక్, వెంకటస్వామి, హెచ్ఎం రాములు నాయక్ పాల్గొన్నారు.

బీజేపీతోనే పేదల సంక్షేమం



సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్‌రెడ్డి

వెల్దండ: బీజేపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్ శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పేదల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేశారన్నారు. ఇంటింటికి కేంద్ర పథకాలు చేరేలా కృషి చేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి పాటుపడుదామన్నారు. కార్యక్రమంలో జిల్లా సంస్థాగత ఎన్నికల కన్వీనర్ మొగిలి దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యాక్షుడు నీరుకంటి రాఘవేందర్‌గౌడు, మండల అధ్యక్షుడు యాదగిరి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, నాయకులు బాలస్వామి, జంగయ్యయాదవ్, మోహన్‌రెడ్డి, శ్రీనివాసచారి, విష్ణుగౌడు తదితరులు ఉన్నారు.

వృద్ధుల సంరక్షణ అందరి బాధ్యత

బిజినేపల్లి: వృద్ధుల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి జీ.సబిత అన్నారు. గురువారం మండలంలోని లూర్దునగర్ కాలనీలోని ప్రశాంతి నిలయంలో ఉంటున్న వృద్ధాశ్రమాన్ని ఆమె సందర్శించారు. ఆశ్రమ పరిసరాలను, వంట గదిని, సరుకులను పరిశీలించారు. రెండు వారాలకు ఒక సారి మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. సిబ్బంది, తదితరులు ఉన్నారు.

చిత్రలేఖనం పోటీలు

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లాస్‌మెట్ క్లబ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనర్సింహరావు మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న కళలను వెలికి తీసేందుకు చిత్రలేఖనం పోటీలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. క్లాస్‌మెట్ క్లబ్ డివిజన్ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి సహకారంతో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అవోపా హైదరాబాద్ వారి సహకారంతో 10వ తరగతి విద్యార్థులకు 100 డిక్షనరీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు శ్యామలాదేవి, రఘురాం, మహేష్, చంద్రశేకర్, వెంకట్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తత అవసరం



బోడబండతండాలో మాట్లాడుతున్న ఎస్ఐ శంషుద్దీన్

చారకొండ: సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శంషుద్దీన్ అన్నారు. మండలంలోని మర్రిపల్లి, బోడబండతండాలో గ్రామస్తులతో గురువారం ఎస్ఐ శంషుద్దీన్ సమావేశమయ్యారు. సైబర్ నేరాలపై, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేష్ నాయక్, కానిస్టేబుల్ ఏడుకొండలు, బానుప్రకాష్, తావు నాయక్, మల్లేష్ నాయక్, దేశ్య నాయక్, ధర్మ నాయక్, శక్రు నాయక్, జంగయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

లింగాల: మండలంలోని సూరాపూర్‌లో గురువారం రాత్రి సైబర్ నేరాలు, ఇతరత్రా మోసాలపై ఎస్ఐ నాగరాజు అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం చెప్పొద్దన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఒకరోజులో డబ్బులు జమ చేయాలి



వరిధాన్యం తేమశాతం పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ అధికారి ఓబులేష్

బిజినేపల్లి: ధాన్యం విక్రయించిన ఒక్కరోజులోనే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలని డీఆర్‌డీఓ అధికారి చిన్న ఓబులేషు ఆదేశించారు. గురువారం మండలంలోని మంగనూర్ గ్రామానికి చెందిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి వడ్ల తేమశాతం పరిశీలించారు. డీపీఎం శ్రీనివాస్, మహిళా సంఘం అధ్యక్షురాలు నిర్మల, వీఓఏ స్వప్న పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు

కొల్లాపూర్: ప్రతిభను వెలికితీసేందుకే విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ ఇమ్మానుయేల్ అన్నారు. ఈనెల 27 నుంచి 29 వరకు కొల్లాపూర్‌లో నిర్వహించనున్న ఆర్‌ఐడీ స్వర్ణోత్సవాల్లో భాగంగా గురువారం పాఠశాలలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. రంగినేని పాపల్‌రావు, అర్జున్‌గౌడ్, మధుసూదన్‌శర్మ, వెంకటయ్య, కురుమయ్య, వరలక్ష్మి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

తిమ్మాజిపేట: ఫర్టిలైజర్ దుకాణ డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఏడీఏ వాసు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో ఉన్న పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులను రైతులకు విక్రయించాలన్నారు. అంతకుముందు ఆగ్రో కేంద్రాన్ని, ఇఫ్కోబజార్‌ను ఆయన సందర్శించారు. ఆయన వెంట ఏఈఓ సాయిరాం ఉన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణాలను ఏఓ చిన్న హుస్సేన్‌యాదవ్ తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్‌బుక్కులు పరిశీలించారు.

వాహనాలకు వేలం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో గురువారం ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడ్డ వాహనాలను వేలం వేయగా రూ. 7.33 లక్షల ఆదాయం సమకూరిందని ఎక్సైజ్ జిల్లా అధికారిని గాయత్రిదేవి పేర్కొన్నారు. 24 వాహనాలను వేలం వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ జిల్లెల వెంకట్‌రెడ్డి, ఎస్ఐ వివేకర్, సిబ్బందిపాల్గొన్నారు.

అక్రమాలపై అధికారుల విచారణ

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని గొరిట ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో జరిగిన రూ.4 కోట్ల అక్రమాలపై గురువారం డీసీసీబీ అసిస్టెంట్ రిజిస్టర్ అంజమ్మ, సీనియర్ అసిస్టెంట్ పురుషోత్తంరావు, జూనియర్ అసిస్టెంట్ నరేష్‌కుమార్ విచారణ చేపట్టారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. 2021వ సంవత్సరంలో రైతులు తీసుకున్న రూ.3 కోట్ల 97 లక్షలు చెల్లించినప్పటికి ఆ రుణాలు 2024 అక్టోబరు నెల 18, 22 తేదీలలో జమ అయినట్లు రికార్డులలో నమోదు చేయడంపై విచారించారు.

విద్యార్థులకు మాక్ పోలింగ్

కోడేరు: మండల కేంద్రంలోని మాడల్ స్కూల్‌లో గురువారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాఘవేంద్ర ఓటు ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. అనంతరం తల్లిదండ్రుల సమావేశం అయ్యారు. శ్రీనివాసచారి, రాఘవేంద్రశర్మ, బాలచంద్ర, అంజలయ్య, ఉస్మాన్, పద్మ, ఉదయ్‌శ్రీ, శ్రీవల్లి, రాణి తదతరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం చార్జీలు పెంచాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్రంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజన చార్జీలను పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సరైన మౌలిక వసతులు లేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రామచందర్, నిర్మల, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

